## ప్రైవేటు క్లినిక్‌లకు 18న చట్టాలపై అవగాహన

### జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి జే వెంకటి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 14(నమస్తే తెలంగాణ): నగరంలోని అన్ని ప్రైవేటు దవాఖానలు, క్లినిక్‌లు, అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లు, డయాగ్నస్టిక్ సెంటర్లు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి జే వెంకటి అన్నారు. ఈ మేరకు ఈ నెల 18వ తేదీన సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సుకు జిల్లాలోని అన్ని ప్రైవేట్ దవాఖానల యాజమాన్యం, డాక్టర్లు, రేడియాలజిస్టులు హాజరు కావాలని సూచించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్, లింగ నిర్ధారణ నిషేధ చట్టం, గర్భస్రావ నిషేధ చట్టం, సరోగసి చట్టంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు దవాఖానలు తగిన వసతులు, సదుపాయాలు, అర్హత కలిగిన డాక్టర్లు, సిబ్బందితో నాణ్యమైన సేవలందించాలని అన్నారు. అన్ని దవాఖానలు తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలని చెప్పారు.

## సీఎంఏ ఫలితాలలో మాస్టర్‌మైండ్స్‌కు ఫస్ట్ ర్యాంక్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 14(నమస్తే తెలంగాణ): ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్స్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా తాజాగా ప్రకటించిన సీఎంఏ ఫలితాలలో ప్రముఖ విద్యా సంస్థ మాస్టర్ మైండ్స్ విద్యార్థులు అఖిల భారత స్థాయిలో ప్రభంజనం సృష్టించారు. ఈ మేరకు సీఎంఏ ఫైనల్‌లో మొదటి పది ర్యాంకుల్లో ఆల్ ఇండియా 1, 2, 5 ర్యాంకులు సాధించిన ముగ్గురు విద్యార్థులతో పాటు ఆల్ ఇండియా 50 ర్యాంకుల లోపు ర్యాంకులు సాధించిన 14 మంది విద్యార్థులు మాస్టర్ మైండ్స్‌కు చెందినవారేనని మాస్టర్ మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ సీఏ మట్టుపల్లి మోహన్ తెలిపారు. సీఎంఏ ఇంటర్‌లో మొదటి 50 ర్యాంకుల్లో ఆల్ ఇండియా 4, 10 ర్యాంకుతో పాటు ఇతర ర్యాంకులు సాధించిన విద్యార్థులు 16 మంది ఉన్నారని, సీఎంఏ ఫైనల్, ఇంటర్ ఫలితాల్లో ఆల్ ఇండియా మొదటి 10 ర్యాకుల్లో 5 ర్యాంకులు, 50 ర్యాంకుల్లో 30 ర్యాంకులు మాస్టర్ మైండ్స్ విద్యార్థులు కైవసం చేసుకున్నారని చెప్పారు.

## లీగల్ అడ్వైజ్ సెంటర్‌కు ప్రత్యేక గుర్తింపు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 14(నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ నాంపల్లి ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన 'లీగల్ ఎయిడ్ అండ్ అడ్వైజ్ సెంటర్'కు ప్రత్యేక గుర్తింపు లభించింది. ప్రజలకు విలువైన సేవలందించినందుకు గాను ఎగ్జిబిషన్ సొసైటీ సేవా సర్టిఫికెట్ అందజేసిందని లీగల్ సర్వీస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెంటర్‌ను హైకోర్టు జడ్జి జస్టిస్ సుజాయ్ జనవరి 6న ప్రారంభించారు. నాటి నుంచి వివిధ చట్టాలు, నల్సాతో పాటు ఇతర స్కీములపై అవగాహన, న్యాయ సేవలను అందించామని తెలిపారు. నల్సా పథకాలపై ప్రత్యేకంగా షార్ట్ ఫిల్మ్‌ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఇప్పటి 200 మంది ఈ సెంటర్ ద్వారా లబ్ధి పొందినట్లు వెల్లడించారు.

## సాహితీ జ్యోతి.. సంపత్కుమారాచార్య

### డాక్టర్ కేవీ రమణాచారి

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 14: తెలుగు సాహితీ రంగంలో ఆచార్య కోవెల సంపత్కుమారాచార్యులు సాహితీ జ్యోతిగా తనదైన ముద్ర వేసుకున్నారని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విస్తరణ సేవా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య 12వ స్మారకోపన్యాసం కార్యక్రమంలో రమణాచారి ముఖ్య అతిథిగా పాల్గొని నిత్యచైతన కవిగా సంపత్కుమారాచార్య నిలిచారని గుర్తు చేశారు. తెలుగు వర్సిటీ వీసీ ఆచార్య నిత్యానందరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంపత్కుమారాచార్య 'పద్య విద్యా వైభవం' అనే అంశంపై ప్రముఖ రచయిత గన్నమరాజు గిరిజా మనోహర బాబు ప్రసంగించారు. రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, విస్తరణ సేవా విభాగం ఇన్‌చార్జి రింగు రామ్మూర్తి పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే సోదరుడికి ఎమ్మెల్సీ కవిత పరామర్శ

మల్లాపూర్, ఫిబ్రవరి 14 : ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోదరుడు బండారి వెంకట్‌రెడ్డి సతీమణి బండారి పద్మ ఇటీవల మరణించడంతో శుక్రవారం సైనిక్‌పురి లోని వారి నివాసంలో లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, నీలంరెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్. మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఉన్నారు.

## 17న ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

### ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బేగంపేట్, ఫిబ్రవరి 14: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ వ్యవస్థాపకులు, అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలను ఈ నెల 17వ తేదీన అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా తెలంగాణ భవన్ లో కేసీఆర్ జన్మదిన వేడుకల ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సనత్ నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో వెస్ట్ మారేడ్పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 17న పార్టీ శ్రేణులు మీమీ ప్రాంతాలలో KCR జన్మదిన వేడుకలలో భాగంగా కేక్ కటింగ్, పండ్ల పంపిణీ, ప్రత్యేక పూజలు, ప్రార్థనలు ఘనంగా జరపాలని చెప్పారు. తెలంగాణ భవన్ లో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే వేడుకలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులతో పాటు రాష్ట్రంలో ని వివిధ ప్రాంతాలకు చెందిన పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు హాజరవుతారని వివరించారు. వేడుకలలో కేక్ కటింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు, కేసీఆర్ జీవిత, రాజకీయ ప్రస్థానాన్ని వివరించేలా రూపొందించిన ప్రత్యేక డాక్యుమెంటరీ ని ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో జన్మదిన వేడుకలకు హాజరుకావాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్లు కొలన్ లక్ష్మి, టి. మహేశ్వరి, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కొలను బాల్ రెడ్డి, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, గుర్రం పవన్ కుమార్ గౌడ్, ఆకుల హరికృష్ణ, శ్రీనివాస్ గౌడ్, వెంకటేషన్ రాజు, అమీర్ పేట డివిజన్ ప్రధాన కార్యదర్శి సంతోష్ మణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఔట్ సోర్సింగ్‌ను రద్దు చేయాలి

### పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్‌కు టీపీఎస్‌ఏ వినతి

హైదరాబాద్, ఫిబ్రవరి 14(నమస్తే తెలంగాణ): పంచాయతీరాజ్ శాఖలో ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ శ్రీజనకు టీపీఎస్ఏ (తెలంగాణ పంచాయతీరాజ్ కార్యదర్శుల అసోసియేషన్) విన్నవించింది. పంచాయతీరాజ్ డైరెక్టర్ కార్యాలయంలో టీపీఎస్ఏ డైరీని డైరెక్టర్ శ్రీజన శుక్రవారం ఆవిష్కరించారు. యూనియన్ నాయకులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీలను నాలుగు గ్రేడ్లుగా విభజించాలని కోరారు. కార్యక్రమంలో టీపీఎస్ఏ చైర్మన్ పి.మధుసూదన్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎస్ వాణి, జనరల్ సెక్రటరీ ఈ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

## వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి

- 17న వీఆర్‌ఏల చలో హైదరాబాద్‌కు పూర్తి మద్దతు
- మాట ప్రకారం 2 లక్షల ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపీ ఆర్.కృష్ణయ్య



వీఆర్‌ఏల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

రవీంద్రభారతి, ఫిబ్రవరి14: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇచ్చిన మాట ప్రకారం, 61 ఏళ్ళు నిండిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేశ్ ఆధ్వర్యంలో వీఆర్‌ఏల జేఏసీ శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, జీవో నం. 81 ప్రకారం, 61 ఏండ్లు పైబడిన వీఆర్‌ఏల ఉద్యోగాలను వారసులకు ఇవ్వాలన్నారు. 20,555 మంది వీఆర్‌ఏల వారసులలో ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో చెప్పారని ఆయన గుర్తు చేశారు. వీఆర్‌ఏల వారసులకు 16,758 మందికి ఉద్యోగాలు ఇచ్చారని, మిగిలిన3,758 మందికి ఉద్యోగాలు రాక వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆయన విమర్శించారు. అధికారం లోకి వచ్చాక వీరికి ఉద్యోగాలు కేటాయిస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకోవాలన్నారు. వీరికి ఉద్యోగాలు ఇస్తే, రెవెన్యూ శాఖ బలోపేతంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి దక్కుతుందన్నారు. వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు కేటాయించడంలో ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల17న చలో హైదరాబాద్‌కు వీఆర్‌ఏలు ఇచ్చిన పిలుపుకు మద్దతు తెలుపుతున్నట్లు ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు.నిరుద్యోగుల ఓటుబ్యాంకుతో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడటం సరికాదని ఆయన విమర్శించారు. తాము అధికారం లోకి వస్తే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పిన సీఎం ఆ హామీలు ఇపుడు ఎక్కడికి పోయాయన్నారు. ప్రభుత్వం వెంటనే నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలను నోటిఫికేషన్ వేసి భర్తీ చేయాలన్నారు. లేకుంటే విద్యార్థులు సీఎం రేవంత్ రెడ్డికి తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిరుద్యోగులను మోసం చేయడానికి పూనుకున్నారని, వీరికి తగిన గుణపాటం చెబుతారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల వారసుల జేఏసీ చైర్మన్ అంజనేయులు, రఘుపతి, అంజి, రమేశ్, చందు, సంగీత, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



## రీజినల్ స్పోర్ట్స్ బోర్డ్ కెప్టెన్‌గా ఆనంద్

హైదరాబాద్, ఆట ప్రతినిధి, ఫిబ్రవరి 14: కాకినాడ (ఆంధ్రప్రదేశ్) వేదిక ఈ నెల 15 నుంచి 28వ తేదీ వరకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ జరగనుంది. ఈ టోర్నీ కోసం రీజినల్ స్పోర్ట్స్ బోర్డ్ హైదరాబాద్ టీమ్‌ను గురువారం ఎంపిక చేశారు. మొత్తం 18 మందితో కూడిన హైదరాబాద్ టీమ్‌కు ఆనంద్ రతన్ కుమార్ కెప్టెన్‌గా, (వైస్) రవి చంద్ర ప్రసాద్, టీమ్ మేనేజర్‌గా వెంకటేశ్వర్లు వ్యవహరించనున్నారు.

## ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలి

- బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం పట్టణ అధ్యక్షుడు శ్రీనాథ్
- శ్రీ చైతన్య పాఠశాల ఎదుట బీఆర్‌ఎస్ వీవీ ఆందోళన



ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ వీవీ నాయకులు

మేడ్చల్, ఫిబ్రవరి 14: ప్రిన్సిపాల్ వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి అఖిల కుటుంబానికి న్యాయం చేయాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం పట్టణ అధ్యక్షుడు శ్రీనాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మేడ్చల్లోని శ్రీ చైతన్య స్కూల్ ఎదుట బీఆర్ఎస్ వీవీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. పాఠశాలలోనికి వెళ్లి యాజమాన్యం కోసం ఆరా తీశారు. శుక్రవారం కూడా పాఠశాలను మూసి వేశారు. నిర్వాహకులు ఎవరూ పాఠశాలకు రాకపోవడంతో ఆగ్రహానికి గురైన వారు దాడికి పాల్పడంతో నోటీసులు, పూల కుండీలు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ మాట్లాడుతూ, ఇటీవల కాలంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం వేధింపులు అధికమయ్యాయన్నారు. సంపాదనే ధ్యేయంగా పని చేస్తూ, మానవత్వాన్ని మరిచి యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయన్నారు. విద్యార్థిని వేధించిన కారణంగా శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థి అఖిల మృతి చెందిందన్నారు. ఫీజు చెల్లించకపోతే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని కానీ, విద్యార్థులను వేధించడం సరికాదన్నారు. విద్యార్థి మృతికి కారణమైన శ్రీ చైతన్య పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, విద్యార్థిని కుటుంబానికి రూ.కోటి నష్టం పరిహారం చెల్లించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల ఆగడాలపై విద్యాశాఖ పర్యవేక్షణ కరువైందని, ఎన్ని ఘటనలు జరిగినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రఘు, అబ్రహం, అరవింద్, ప్రదీప్, శశి తదితరులు పాల్గొన్నారు.

## బకాయి విడుదల చేసి ఆత్మహత్యలను నివారించాలి

### జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్

కాచిగూడ, ఫిబ్రవరి 14: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల రూ.4,500 కోట్ల ఫీజుల బకాయిలను విడుదల చేసి, ఆత్మహత్యలను నివారించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. నింబోలి అడ్డా కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కళాశాల యాజమాన్యాలు ఫీజు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి తేవడంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేండ్ల నుంచి ఫీజులు చెల్లించడం లేదని, బకాయిలు చెల్లించక పోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల కోర్సులు పూర్తి అయినప్పటికీ సర్టిఫికెట్లను ఇవ్వడం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఆత్మహత్యల నిరోధానికి నిపుణుల కమిటీని వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పి.కృష్ణ, ముత్యాల రావు, ప్రశాంత్ నిమ్‌కర్, సత్యపాల్ సింగ్, భాస్కర్, ప్రదీప్ గౌడ్ పాల్గొన్నారు.

## మర్రి శిక్షణ, నైపుణ్యాభివృద్ధికి సోపానం

### పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 14(నమస్తే తెలంగాణ): 'ధాన్యం సేకరణ – సవాళ్ళు' అనే అంశంపై నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణలో పాల్గొనడం ద్వారా ఎన్నో మెళకువలు తెలిశాయని పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్ మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ స్పష్టం చేశారు. ఆయన జూబ్లీ హిల్స్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శుక్రవారం మాట్లాడారు.. కనీస మద్దతు ధర, రైతుల నుంచి వడ్లను సేకరించి మిల్లింగ్ చేయడం, ఎఫ్ సీఐకి పంపడం తదితర విషయాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అప్రమత్తత పాటు మెళకువలపై అవగాహనకు అవకాశం కలిగిందని రఘునందన్ అన్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణలో ధాన్యం సేకరణలో భారత ప్రభుత్వ ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) పౌర సరఫరాల శాఖ, పౌర సరఫరాల సంస్థల కీలక పాత్రపై శిక్షణలో చక్కటి అవగాహన కలిగిందని చెప్పారు. ఖరీఫ్, రబీ పంటల గురించి, రైస్ మిల్లింగ్ లో ముడిపడిన పలు కీలక అంశాలపై శిక్షణలో స్పష్టత వచ్చిందని రఘునందన్ అభిప్రాయ పడ్డారు.

## ఎస్సీ వర్గీకరణను వెంటనే రద్దు చేయాలి

- రేవంత్ రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానాన్ని తక్షణమే రద్దు చేయాలి
- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డా. వీఎల్ రాజు
- ఎస్సీ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మన్ వడ్లమూరి కృష్ణస్వరూప్




అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న డా.వీఎల్ రాజు, వడ్లమూరి కృష్ణ స్వరూప్, ఇతర మాల పెద్దలు

రవీంద్రభారతి, ఫిబ్రవరి14: ఎస్సీ వర్గీకరణను తెలంగాణ ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డా. వీఎల్ రాజు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్, సుప్రీం కోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. ట్యాంక్‌బండ్‌పై గల అంబేద్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం పెద్ద ఎత్తున గుమికూడి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన వడ్లమూరి కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ, మెజార్టీ జనాభా ఉన్న మాలలను తక్కువ జనాభాను చూపి, వర్గీకరణ పేరుతో మాలలకు తీవ్ర అన్యాయం చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మాలల ఓట్లతో గద్దెనెక్కిన సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం మాల జాతికి వెన్నుపోటు పొడిచిందని ఆయన విమర్శించారు. తెలంగాణ అసెంబ్లీలో మాలల పక్షాన వర్గీకరణకు వ్యతిరేకంగా గళం ఇనిపించాల్సిన మాల మంత్రులు, ఎమ్మెల్యేలు రేవంత్ రెడ్డి అమ్ముడుపోయి మాల జాతికి మోసం చేసిన మాల ప్రజాప్రతినిధులు తక్షణమే తమ పదవులకు రాజీనామ చేసి, జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చర్యలతో మాలలతో పాటు 57 ఎస్సీ కులాలకు విద్యా, ఉద్యోగ రంగాల్లో తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ, కాంగ్రెస్, ఎంఆర్‌పీఎస్, ఆర్ఎస్ఎస్‌లు రాజకీయ కుట్రలు చేసి పూర్తి స్థాయిలో దళితుల భవిష్యత్తుకు దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి సంకు శ్రీనివాసులు, పబ్బతి శ్రీకృష్ణ, నక్క దేవేందర్ రావు, బేగరి చంద్రశేఖర్, గ్రేటర్‌హైదరాబాద్ అధ్యక్షుడు అక్కి దాసరి రవీంద్ర బాబు, మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు సీహెచ్ రోజా లీల, హేమలత, మద్దెల ప్రవీణ్ కుమార్, సుబ్బారావు, సత్యనారాయణ, సురేశ్ పాల్గొన్నారు.


## నుమాయిష్‌కు అంతర్జాతీయ గుర్తింపు

### ముగింపు వేడుకలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు




బహుమతులను ప్రదానం చేస్తున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు డి.శ్రీధర్ బాబు

అబిడ్స్, ఫిబ్రవరి 14: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించే అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు పేర్కొన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన 84వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన ముగింపు ఉత్సవాలు శుక్రవారం జరిగాయి. ఇందుకు ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, ఈ ప్రదర్శనకు ఇప్పటి వరకు 17 లక్షల 46 వేల 313 మంది సందర్శకులు వచ్చారని తెలిపారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి చిన్న, మధ్య తరగతికి చెందిన వ్యాపారులు ఉత్పత్తి చేసిన వస్తువులను విక్రయించుకునేందుకు మన నుమాయిష్ వేదిక కావడం సంతోషకరంగా ఉందన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో 20 విద్యా సంస్థలను నడపడం ఎంతో గొప్ప విషయమన్నారు. 46 రోజుల పాటు కొనసాగే ఈ నుమాయిష్ ప్రదర్శనలో కాశ్మీర్ నుంచి కన్యా కుమారి వరకు వివిధ రాష్ట్రాల నుంచి వేల మంది వ్యాపారులు ఇక్కడికి వచ్చి తమ వస్తువులను విక్రయించి లాభాల బాటన పడుతున్నారన్నారు. 46 రోజుల పాటు నుమాయిష్‌ను సజావుగా నిర్వహించడం కత్తి మీద సాము లాంటిదని, ఇలాంటి ప్రశాంత వాతావరణంలో ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు ఎంతో సమన్వయంతో ప్రదర్శనను నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. 17 ప్రభుత్వ విభాగాలను అనుసంధానం చేయడం వలన నుమాయిష్ విజయవంతంగా కొనసాగుతూ, రోల్ మోడల్‌గా నిలబడిందని తెలిపారు. ప్రతి సంవత్సరం జనవరి ఒకటో తేదీన ప్రారంభం కావాల్సిన నుమాయిష్ దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సంతాప దినాలతో మూడో తేదీ నుంచి ప్రారంభించడం జరిగిందన్నారు. స్టాల్ యజమానుల అభ్యర్థన మేరకు రెండు రోజుల పాటు నుమాయిష్‌ను పొడిగించినట్లు తెలిపారు. అనంతరం, సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న విద్యా సంస్థల విద్యార్థినులు అత్యధిక మార్కులు సాధించగా, వారికి గోల్డ్ మెడల్‌తో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. అదే విధంగా నుమాయిష్‌లో 46 రోజుల పాటు సందర్శకులకు ఉత్తమ సేవలను అందించిన స్టాల్ నిర్వాహకులు, పోలీస్, ట్రాఫిక్, విద్యుత్, ఆర్ అండ్ బీ అధికారులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు కె.నిరంజన్, కార్యదర్శి బి.సురేందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి డి.మోహన్, కోశాధికారి డాక్టర్ బి.ప్రభాశంకర్, కార్యక్రమ సలహాదారులు వనం వీరేందర్, కన్వీనర్ ధీరజ్ కుమార్ జైస్వాల్, సభ్యులు అలేఖ్య పుంజాల, వినయ్ కుమార్ ముదిరాజ్, డాక్టర్ గంగాధర్, సుఖేశ్ రెడ్డి, ఆదిత్య మార్గం, అశ్విన్ మార్గం, రవి తదితరులు పాల్గొన్నారు.




## డా. పలుకూరి లక్ష్మికి భారత్‌కే అన్మోల్ రతన్ అవార్డు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 14(నమస్తే తెలంగాణ): ఉస్మానియా జనరల్ హాస్పిటల్ ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ పలుకూరి లక్ష్మికి 'భారత్‌కే అన్మోల్ రతన్' అవార్డు దక్కింది. జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హోటల్ తాజ్ దక్కన్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ సినీనటి కుష్బూ సుందర్, స్పీకర్ గడ్డం ప్రసాద్ చేతుల మీదుగా డా.లక్ష్మి ఈ అవార్డును అందుకున్నారు. ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తూ నిరుపేద రోగులకు మెరుగైన వైద్యసేవలందిస్తున్నందుకు గాను డా.లక్ష్మికి ఈ అవార్డు లభించింది.



గేమింగ్ పరిశ్రమ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సుభాష్ సుప్రూ

## గేమింగ్‌కు మున్ముందు మంచి రోజులు

### సీఐఐ హెడ్ సుభాష్ సుప్రూ

పోచారం, ఫిబ్రవరి 14: రానున్న రోజులలో గేమింగ్‌పరిశ్రమకు మంచి రోజులు వస్తాయని సీఐఐ హెడ్ సుభాష్ సుప్రూ అన్నారు. పోచారం మున్సిపాలిటీ వెంకటాపురంలోని అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం సీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులకు గేమింగ్ పరిశ్రమపై ఒక రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుభాష్ సుప్రూ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఐసీటీ అకాడమీ, ఇండియన్ గేమింగ్, డిజైన్ సొసైటీ, వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్టెన్మెంట్ తదితర సంస్థలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాయని తెలిపారు. ట్రేడింగ్, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవస్థాపకతను సీఐఐ ప్రోత్సహిస్తుందని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జి.విష్ణుమూర్తి, ప్రొఫెసర్ వి.విజయ కుమార్, డీన్ డాక్టర్ మహిపతి శ్రీనివాసరావు, అడ్మిషన్స్ డైరెక్టర్ వి.శ్రీనివాస రావు, సమన్వయ కర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వర్గీకరణ చిచ్చు పెట్టిన రేవంత్ ను, బీజేపీని ఓడించాలి

### మాల మహానాడు జాతీయ అధ్యక్షులు, ఎస్సీ వర్గీకరణ జాతీయ వర్కింగ్‌చైర్మన్ పబ్బతి శ్రీకృష్ణ

కవాడిగూడ, ఫిబ్రవరి 14: మాల మాదిగలతో పాటు ఇతర ఎస్సీ కులాల మధ్య వర్గీకరణ చిచ్చు పెట్టిన రేవంత్ సర్కార్ ను, బీజేపీని ఓడించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు, ఎస్సీ వర్గీకరణ జాతీయ వర్కింగ్ చైర్మన్ పబ్బతి శ్రీకృష్ణ పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ జాతీయ కమిటీ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా హైదరాబాద్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద వర్గీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షులు, ఎస్సీ వర్గీకరణ జాతీయ వర్కింగ్‌చైర్మన్ పబ్బతి శ్రీకృష్ణ హాజరై జాతీయ చైర్మన్ వడ్లమూడి కృష్ణ స్వరూప్ తో కలిసి డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, బీజేపీ ఆదేశాలను పాటిస్తూ రాష్ట్ర జనాభా లెక్కల్లో మాల కులస్తులను తక్కువ చేసి చూపించారన్నారు. ఈ సారి జరగబోయే జనాభా లెక్కల్లో అందరూ మాల అని రాయించుకోవాలని, అప్పుడే మాలలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. లేనట్లయితే చరిత్రలో మాలలు అంతరించి పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్లమూడి కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ ను ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ, బీజేపీలను ఓడించి మాలలు తమ సత్తా చాటాలన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా న్యాయ పోరాటం కూడా చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ జేఎల్ రావు, రాష్ట్ర మహిళా కమిటీ నాయకులు దళిత బహుజన పార్టీ నాయకులు పాల్గొన్నారు.